ప్రైవేటు కళాశాలలే దిక్కు!

పేద విద్యార్థులకు గాజువాకలో ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారింది. డిగ్రీ చదవాలంటే ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సిందే. పాలిటెక్నిక్ లాంటి సాంకేతిక విద్యకైతే వేరే ప్రాంతం వెళ్లాల్సిందే. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన గాజువాక మినీ ఇండియాగా అవతరించినా ప్రభుత్వ విద్యా సంస్థలు మాత్రం చేరువ కాలేదు. ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కాలేజీతో పాటు డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్న నేతల హామీలు దశాబ్దాలు గడుస్తున్నా ఆచరణలోకి రాని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఇక్కడి విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలే దిక్కవుతున్నాయి.

– గాజువాక

▼ గాజువాకలో ప్రభుత్వ కళాశాలలు అందని ద్రాక్షే
▼ నెరవేరని నేతల హామీలు ▼ దూరమవుతున్న పేద విద్యార్థులు



గాజువాక ముఖచిత్రం



గాజువాక హైస్కూల్‌లో హైస్కూల్ ప్లస్ బ్లాకు

నగరానికి గుండెకాయలాంటి గాజువాక పట్టణంలో ఒక్క ప్రభుత్వ కళాశాల కూడా లేదు. కనీసం జూనియర్ కళాశాలైనా ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు రెండు దశాబ్దాలుగా కోరుతున్నారు. గాజువాక పారిశ్రామికంగా అభివద్ధి చెందడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడికి వలస వచ్చి స్థిర నివాసాలు ఏర్పరుచుకున్నారు. ఏదో ఒకచోట ఉపాధో, ఉద్యోగమో చేసుకొంటూ పిల్లలను చదివించుకుంటారు. వారి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడం కోసం ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

నాలుగున్నర లక్షల జనాభా ఉన్నా..

సుమారు నాలుగు ఐదు లక్షలమంది జనం ఉన్న గాజువాక ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలలను ఇక్కడ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ 2014 నుంచి గట్టిగా వినిపిస్తోంది. అయితే ఆ డిమాండ్ ప్రతిపాదనల దశలోనే ఆగిపోయింది. పారిశ్రామిక ముఖద్వారంగా ఉన్న గాజువాకలో కార్మిక కుటుంబాలు, రోజు కూలీలు, పేదలు అధిక సంఖ్యలో ఉన్నారు. తమ సంపాదనతో పిల్లలను చదించుకోవడం కష్టమైనప్పటికీ వారి భవిష్యత్ కోసం అప్పులు చేసి చదివించుకొనే పరిస్థితి ఉంది. అప్పు కూడా చేయలేని కుటుంబాలు మాత్రం తమ పిల్లలను చదువు మాన్పించుకోవడమో, ఐటీఐలకు పంపడంతోనో సరిపెట్టుకొంటున్నారు. గాజువాకలో పది ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఆరు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇవిగాక, వందలాది మంది విద్యార్థులు నగరంలోని వివిధ కళాశాలలకు కూడా వెళ్తున్నారు. నేతలు ఇచ్చిన హామీ నెరవేరితే తమకు స్వాంతన చేకూరుతుందని భావిస్తున్న ప్రజలకు మాత్రం నిరాశ ఎదురవుతూనే ఉంది.

వైఎస్ హయాంలో..

ఇక్కడి విద్యార్థులు, తల్లిదండ్రుల కష్టాలను విన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అగనంపూడిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడ వివిధ హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్ పేరుతో జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ఉన్నత విద్యనభ్యసించాలన్న పేద పిల్లలకు ఇంటర్మీడియట్ చదువుకొనే అవకాశం లభించింది. కానీ, డిగ్రీ, పాలిటెక్నిక్ చదువుకోవాలనుకొనే విద్యార్థుల కల నెరవేరడం లేదు.



గాజువాకలోని హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థులు

ఉన్నత చదువులకు దూరం



గాజువాకలో ఎటు చూసినా ప్రైవేట్ కాలేజీలే ఉన్నాయి. వాటిలో చేరి లక్షలకు లక్షలు ఫీజులు చెల్లించుకోలేని చాలామంది చదువు మానేయాల్సిన పరిస్థితి వస్తుంది. లక్షల్లో ఫీజులు చెల్లించుకోలేని విద్యార్థులు పదో తరగతి తర్వాత చదువు మానేస్తున్నారు. ఎలాగైనా చదువుకోవాలి అనుకొనేవారు ఐటీఐ వరకు చదువుకొని ఆ తర్వాత కూలిపనులకు వెళ్లిపోవాల్సి వస్తుంది.

– బి.మన్మధ్, గాజువాక

ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం దారుణం



ప్రఖ్యాతి గాంచిన గాజువాకలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం దారుణం. ఉన్నత విద్య కోసం నియోజకవర్గం మొత్తానికి ఒక్క ప్రభుత్వ కళాశాల కూడా ఏర్పాటు చేయకపోవడం ఇక్కడి విద్యార్థులకు అన్యాయం చేయడమే. గాజువాక ప్రాంతంలో కార్మిక కుటుంబాలు అధికంగా ఉన్నాయి. వారి ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

– పి.వి.నాగేశ్వరరావు, న్యాయవాది

‘జేసీఎల్ ఆదేశాలు పట్టించుకోరా..’

అగనంపూడి: విశాఖ ఉక్కులో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఉద్యోగి సీతిన అచ్యుతరావు కుటుంబానికి యాజమాన్యం నష్టపరిహారం, ఇతర అలవెన్స్‌లు చెల్లించడం లేదని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు అన్నారు. ఇదే విషయమై గత నెలలో జేసీఎల్ తక్షణమే నష్టపరిహారం, ఇతర అలవెన్స్‌లు చెల్లించాలని యాజమాన్యాన్ని ఆదేశించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. 9 ఏళ్ల కిందట అచ్యుతరావు మరణించినా ఇప్పటి వరకూ ఆయన కుటుంబానికి ఎలాంటి అలవెన్స్‌లు చెల్లించకపోవడంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు జాయింట్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జేసీఎల్ గత నెల 13న ఆదేశాలిచ్చారు. పక్షం రోజుల్లో 8 సంవత్సరాల పది మాసాలకు వడ్డీతో కలుపుకొని చెల్లించాలని ఆదేశించారు. అయితే నెల రోజులు దాటినా యాజమాన్యం స్పందించకపోవడంతో తాజాగా అచ్యుత రావు భార్య సీతిన లక్ష్మి కార్మికశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా



రంగా విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: వంగవీటి మోహనరంగాకు గాజువాక శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు. శ్రీనగర్‌లోని రంగా విగ్రహానికి 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎవరికీ లేని ఆదరణ సంపాదించుకున్నారన్నారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: ఇండస్ట్రియల్ ఏరియా 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

కృష్ణావతారంలో జగన్నాథుడు



కృష్ణావతారంలో దర్శనిమిచ్చిన జగన్నాథస్వామి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని జగన్నాథస్వామి ఆలయంలో రథోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉత్సవమూర్తి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దశావతారాల్లో భాగంగా 8వ రోజు సుభద్ర, బలభద్రుని సహిత జగన్నాథస్వామిని ఆలయ అర్చకుడు గురు సంతోష్ కృష్ణావతారంలో అలంకరింపజేసి భక్తులకు దర్శనం కల్పించారు. అగనంపూడి, దువ్వాడ, లంకెలపాలెం, వడ్లపూడి, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర ప్రాంతాల నుంచి పండా కుటుంబీకులు, భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు.

పాఠశాల స్థాయి నుంచే ఆవిష్కరణలు



లైవ్ ప్రాజెక్టులను వివరిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనాత్మక, ఆవిష్కరణాత్మక ఆలోచనలపై దృష్టి సారించాలని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. విజ్ఞాన్ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సబ్బవరం పాఠశాలకు చెందిన 7 నుంచి పది తరగతుల విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, లైవ్ ప్రాజెక్టుపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఈసీఈ విద్యార్థులు, బి.కరుణ, బి.భరణి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని క్రేన్లపై రవాణా శాఖాధికారుల కొరడా

పెదగంట్యాడ: రికార్డులు లేని క్రేన్లపై రవాణా శాఖాధికారులు శుక్రవారం కొరడా ఝుళిపించారు. పెదగంట్యాడలోని పారిశ్రామిక ప్రాంతంలో రవాణా శాఖాధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. రికార్డులు లేని, ఇన్సూరెన్సులు చెల్లించని వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖాధికారి సత్యం నాయుడు మాట్లాడుతూ వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించకపోతే ఏదైనా ప్రమాదం జరిగినపుడు క్రేన్ల ఆపరేటర్లు, వర్కర్లకు ఎటువంటి క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. దీని కారణంగా వారి కుటుంబ సభ్యులు నష్టపోతారన్నారు. వాహనాల యజమానులు విధిగా ఇన్సూరెన్సులు చేయించుకోవాలని చెప్పారు. లేకపోతే కఠినంగా వ్యవహరిస్తామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్‌లో నియామకాలపై ఏఐటీయూసీ అభ్యంతరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తూనే, మరోవైపు టోటల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ (టీఎంసీ) పేరిట ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఆర్.ఎం.హెచ్.పి విభాగంలో ఇటీవల అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని గుర్తుచేశారు. అయితే అదే ఆర్.ఎం.హెచ్.పి విభాగంలో టీఎంసీ కాంట్రాక్ట్ పొందిన ఆదిత్య లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తమ వద్ద విధులు నిర్వహించేందుకు నగరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తోందని డాక్టర్ వెంకటరావు వెల్లడించారు. ఈ విభాగంలో తొలగించిన అనుభవం కలిగిన కాంట్రాక్ట్ కార్మికులను టీఎంసీలో చేర్చుకుంటే ప్లాంట్‌కు నైపుణ్యం కలిగిన కార్మికులు దొరికేవారని ఆయన అభిప్రాయపడ్డారు. డాక్టర్ బూసి వెంకటరావు ,యూనియన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

నేటి వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశానికి తరలిరండి



తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు రుషికొండలో గల ఏ1-గ్రాండ్ హోటల్‌ల్లో జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అధ్యక్షతన జరుగుతుందని.. దీనికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి తెలిపారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో ఆదివారం జగ్గు జంక్షన్‌లోని గాజువాక క్లబ్‌లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్టు దేవన్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానులంతా అధిక సంఖ్యలో తరలి వచ్చి రెండు చోట్ల కార్యక్రమాలను విజయంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



స్టీల్ సిటీ డిపో వద్ద ధర్నా చేస్తున్న పీటీడీ నాయకులు, కార్మికులు

ఉక్కునగరం: ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీటీడీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్టీల్ సిటీ డిపో వద్ద ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెంటనే 12వ పీఆర్సీ వేసి మధ్యంతర భృతి ప్రకటించాలని, 11వ పీఆర్సీకి సంబంధించి 24 నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. డబుల్ డ్యూటీలకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 800 రూ. వెయ్యికు పెంచాలని, సీసీఎస్ కార్యాలయాన్ని ఎండీ కార్యాలయంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. డిపో కార్యదర్శి బండారు రాము ,పి. పదర్మ, కె. సత్తిబాబు, కె. సీహెచ్.ఎస్. రావు, ఐ.యు.ఎం. రావు తదితరులు పాల్గొన్నారు.

‘అమృత్ భారత్’ పనుల్లో నాణ్యత గాలికి!

- బీటీరోడ్డు లేయర్ పైపైకి...
- పదిరోజుల్లోనే రాళ్లు తేలిన రహదారి



దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారం వైపు నిర్మించిన బీటీ రోడ్డు దుస్థితి

అగనంపూడి: అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారం వైపు విస్తరించిన రహదారి పది రోజుల్లోనే పైకి తేలింది. దీంతో పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్ నచ్చినట్టు పనులు చేస్తున్నారని మండిపడుతున్నారు. రహదారి విస్తరణ పనులు సుమారు ఏడాది పాటు సాగదీసిన కాంట్రాక్టర్ నెల రోజుల నుంచి ఆదరాబాదరాగా పనులు ముగించి మమా అనిపించారు. రహదారి నిర్మించిన పది రోజులకే బీటీ రోడ్డు మొదటి లేయర్ పెక్క తేలిపోవడంతో నాణ్యత ఎంత ఉందో తేలిపోయింది. మట్టిని అడుగున్నర వరకు తవ్వి తీసేసి మొదటి లేయర్‌గా క్రసర్ బుగ్గి వేయాలి. తర్వాత 40ఎంఎం బ్లాక్ మెటల్, తర్వాత లేయర్ 20ఎంఎం మెటల్‌తో నిర్మించిన తర్వాత బీటీ లేయర్ బీబీచిప్‌తో నిర్మించాల్సి ఉంది. అయితే రోడ్డు పనులు నాసిరకంగా సాగడంతో నిర్మించిన పది రోజుల్లోనే బీబీచిప్స్‌తోపాటు మట్టి పైకి తేలిపోయింది. దీంతో స్థానికులు, ప్రయాణికులు, ప్రజా సంఘాలు పెదవి విరుస్తున్నాయి.

పీఠం పేరుతో ఆక్రమణలను అడ్డుకోవాలి

ఆర్డీవో, తహసీల్దార్లకు ఫిర్యాదు



పీఠం పేరుతో నిర్మిస్తున్న కట్టడం

అగనంపూడి: గాజువాక మండలం అగనంపూడి రెవెన్యూ పరిధిలో గెడ్డ పోరంబోకు స్థలంలో పీఠం పేరుతో నిర్మిస్తున్న కట్టడాలను వెంటనే తొలగించాలని విశాఖ ఆర్డీవో, గాజువాక తహసీల్దార్లకు శీరంశెట్టి లక్ష్మి ఫిర్యాదు చేశారు. గొళ్లవానిపాలెం సర్వేనంబర్ 24 నీరు పారే గెడ్డ పోరంబోకు స్థలం ఉందని, ఈ స్థలాన్ని గతంలో కొందరు ఆక్రమించి బడ్డీ ఏర్పాటు చేయగా అధికారులకు ఫిర్యాదు చేయడంతో వాటిని తొలగించి బోర్డు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అయితే అదే స్థలంలో కాళీ పీఠం పేరుతో నిర్మాణం సాగిస్తున్నారని, ఈ విషయంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్మాణాలు తొలగించి ప్రజా ప్రయోజనాల కోసం స్థలాన్ని వినియోగించాలని ఆమె కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

మహారాణిపేట: నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఇటీవల జరిగిన డీఆర్సీ, దిశా సమావేశాల్లో చర్చించిన అంశాలపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం పలు విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలను ఆయా శాఖలు సమీక్షించి, వాటికి త్వరితగతిన పరిష్కారాలు చూపాలన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయా శాఖల పరిధిలో సాధించిన ప్రగతి గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా అల్లూరి జయంతి



అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేస్తున్న కోమటి శ్రీనివాస్ తదితరులు



సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇల్లపు రాము



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గోవింద్ తదితరులు



శ్రీనగర్‌లో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



సాయినగర్ కాలనీలో నివాళులర్పిస్తున్న నాయకులు



పాత అగనంపూడి కూడలిలో..



ఉక్కులో అల్లూరికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సంఘం నాయకులు

గాజువాక: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు పలువురు నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన నిర్వహించిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు.

- అల్లూరి సీతారామరాజు జయంతిని 71, 72వ వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు భూపతిరాజు శ్రీనివాసరావు, సిరట్ల వాసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనగర్ జంక్షన్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆర్టీసీ రాజు, బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ దీనంకొండ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.
- శ్రీనగర్‌లోని సీతారామరాజు విగ్రహం వద్ద టీడీపీ నాయకులు రాజారావు, నాయుడు తదితరులు నివాళులర్పించారు.

కూర్మన్నపాలెం: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 87వ వార్డు లక్ష్మీపురం కాలనీలో అల్లూరి విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు సీతారామరాజు స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాన్ని వివరించారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు సీతారామరాజు విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుబ్బరాజు, తిలక్‌రాజు గంధవరపు మురళి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు రాము ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మహా వీరుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో దుగ్గపుదానప్పలు, గోవిందరాజులు, సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.
- వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డగోవింద్ అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రగడశ్రీనివాసరావు, వెంకటసూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సాయినగర్ కాలనీలో అల్లూరి విగ్రహానికి ప్రజా సంఘం నాయకులు గవర సోమశేఖర్, చేకూరి నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.వసంత్, ఎస్.వి.రమణ, సన్ని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- 79వ వార్డు పాత అగనంపూడి కూడలిలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు.జగన్నాథస్వామి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కరణం పైడిరాజు, సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, నాయకులు కోసూరి తాతారావు, సింగిడి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని సెక్టార్-6 అల్లూరి కూడలి వద్ద ఉక్కునగరం క్షత్రియ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి టౌన్ అడ్మిన్ విభాగం డీజీఎం వి.ఎస్. భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘం నాయకులు కె.వి. సుబ్బరాజు, సాయిరామరాజు, పి.గోపాలకృష్ణరాజు, ఐ.వి.ఎం. రాజు, పెద్దిరాజు, కోట రామకృష్ణ, టి.వి. రాజు, సుబ్రమణ్య రాజు, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె శోభారాణి తెలిపారు.

కేవీలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో మిగిలిన సీట్ల భర్తీకి పాఠశాల యాజమాన్యం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 4,9 తరగతుల్లో మిగిలిన సీట్లు, 6వ తరగతిలో మిగిలి ఉన్న ఎస్టీ కేటగిరీ సీట్లు, 10, 12 తరగతుల్లో మిగిలిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల సీట్ల భర్తీ ఈనెల 8న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు. జూలై 10న 4,6,10, 12 తరగతులకు లాటరీ ద్వారా, 9వ తరగతికు పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా పింగళి వర్ధంతి



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న వినోద్‌కుమార్, విద్యార్థులు

పెదగంట్యాడ: స్వాంతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని శుక్రవారం చాపలపాలెం ఎంపీపీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన జాతీయ జెండాను రూపొందిన పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వ కారణమన్నారు. పాఠశాల సిబ్బంది హేమంత్, సూరాడ రాంబాబు, బి. అనిత తదితరులు పాల్గొన్నారు.